# వ్యాస కౌముది



## రామాయణంలో స్త్రీ పాత్రలు - I

- ప్రమీలా చంద్రమోహన్

**రామాయణమనగానే** ఇది అందరికీ తెలిసినదే. కొత్త విషయమేముంటుంది? ఒక్కొక్కరు ఒక్కొక్క కోణంలో విషయ విమర్శ చేస్తారు.

విశ్వనాధ వారు, రోజూ తినేది అన్నమే అయినా వేరు వేరు రుచులతో తిన్నట్లు తాను కూడా రామాయణాన్ని తన కోణంలో వ్రాస్తానని అన్నారట. అంతేగాక 'ఎవరి అనుభూతి వారిదని' నిర్ద్వందంగా ఖండించారట.

ఇలా ఎవరెవరో వారికి అర్ధమయినట్లు కావ్యాన్నే తిరగ రాయగా లేనిది అందులో కొన్ని పాత్రలు (ముఖ్యంగా స్త్రీ పాత్రలు) తీసుకుని నీకు అర్ధమయిన రీతిలో నువ్వు వ్రాయమని, మా శ్రీవారు నన్ను చెవినిల్లు కట్టుకుని పోరారు. నేనెంత దాన్ని ఆ పాత్రల స్వరూప స్వభావాలు చెప్పేందుకు అంటే 'ఎవరూ దేని విషయంలోనూ పరిపూర్ణులు కారు', నీ కర్ధమయినట్లు నువ్వు రాయి అని చెప్పారు.

సరే అని మొదలు పెడితే వరసగా కౌసల్య, సుమిత్ర, కైకేయి మొదట మా గురించి వ్రాయమన్నారు.

మంధర లేని రామాయణమే లేదు అని మంధర వెంట బడింది.

అహల్య, శబరి నాతో దోబూచులాడారు. రామాయణమంటేనే సీత చరిత్రమని వాల్మీకి మహర్షుల వారే అన్నారని తెలిసింది.

ఊర్మిళను ఎవరూ తలుచుకోలేరుగాని ఆకు చాటు పిందెలాగా ఆమె లక్ష్మణుని అభ్యుదయానికి పాటుపడింది. ఆమె యోగశక్తి సాటిలేనిదని వినికిడి.

చుప్పనాతి శూర్పణఖ రామాయణంలో రావణ వధకు కారకురాలయింది.

తార, త్రిజట, మండోదరి మమ్మల్ని చచ్చిపోవద్దన్నారు.

ఇలా రామాయణంలో స్త్రీ పాత్రలు నన్ను వెన్నంటి వాని చరిత్ర వ్రాయించుకున్నాయి. అంతే గాక రామాయణం ప్రతి మలుపులోనూ ఒక్కొక్క స్త్రీ పాత్ర ఇంకో విధంగా కధ తిప్పుతుంది. ఉదాహరణకి మంధర మూలంగా రామ వనవాసము, శూర్పణఖ మూలంగా రావణ వధ.

### సీత

వాల్మీకి మహర్షుల వారే 'సీతయా చరితం మహత్' అని అన్నారు. శ్రీరాముని 'రామం సత్య పరాక్రమ వాన్' ఒక రకంగా చూస్తే ఎంత ఆకు చాటు పిందె అయినా ఆమె చరిత్రే రామాయణమనిపిస్తుంది.

సీత అయోనిజ. తన పుట్టుకకై ఎవరినీ కష్టపెట్టలేదు. జనక రాజర్షి ఇంట పెరిగింది. ఎంతో చిన్నతనం నుండి అందరికి కనుపాపగా, అల్లారు ముద్దుగా పెరిగింది. చిన్నతనంలో బంతి శివధనస్సు వున్న పేటిక క్రిందకి పోతే, ఎంతో మంది వీరులు కలిసి కాని కదపలేని పేటికను, అలవోకగా ఒక చేతితో తోసి బంతి అందుకుంటుంది. ఇది చూసిన జనక రాజర్షి, ఆ శివ ధనస్సును ఎక్కుపెట్టిన వాడే తన పుత్రికను చేపట్టగలడని ప్రకటిస్తాడు.

ఎంతోమంది వీరులు స్వయంవరానికి వచ్చి శివ ధనస్సు ఎక్కుపెట్టలేక తిరిగిపోతారు. జనకుడి యజ్ఞం చూడడానికి విశ్వామిత్రునితో వచ్చిన రాముడూ, ఆ మహర్షి ఆజ్ఞ ప్రకారం విల్లు ఎక్కుపెట్టడానికి తీస్తే అది పుటుక్కున విరిగింది. ఆ విధంగా జనక మహర్షి ప్రతిన నెరవేరి జానకి, శ్రీరాముని చెట్టబట్టింది. వీర్యశుల్కగా పేరుగాంచింది.

అయోధ్యలో సుఖంగా కాలం గడుపుతుండగా, శ్రీరాముని పట్ట భంగం, వనవాస ప్రయాణము, నివురుగప్పిన నిప్పులా ఉన్న సీతమ్మ గుణగణాలను బయట పడవేశాయి. రామునితో పట్టుబట్టి తాను కూడా వనవాసానికి వస్తానని, వివాహమనంగా ఇరువురు విశేష భారము వహించటమని, జ్యోతిష్కులు తాను భర్తతో కలిసి వనవాసం చేస్తుందని చెప్పారని, ఎన్నో విధాల చెప్పి వనవాసానికి వెడుతుంది. కాని వారు వనవాసంలో వాన ప్రస్థులుగానే గడుపుతారు. కొంతమంది సంసార వ్యామోహం చంపుకోలేక సీతమ్మ రాముని వెంట పడిందని అంటారు. కాని భవిష్యత్తు తెలిసిన సీత, రావణ సంహారానికే అడవికి వెళ్ళిందని కొంతమంది అంటారు. వనవాసమైనా, పురవాసమైన రాముని తోనే జీవనమని, రాముడు లేని చోటు ఏదైనా అది నా వల్లకాదేనని సీత ఉవాచ, అరణ్యంలో కష్ట నష్టాలు ఓర్పుతో భరించిందే, కాని భర్తమీద సణగలేదు. తనకు చేతనైనంతలో భర్తకు సౌకర్యాలు చేసింది.

విపిన ప్రయాణానికి ముందు అత్త కౌసల్య తనకు స్త్రీ ధర్మాలు బోధించగా సంతసించి, వీనిని గురించి పుట్టింటిలోనే తెలుసుకున్నానని, చంద్రునకు ఛాయ దూరమైనపుడే, తాను రామునకు దూరమవుతుందని చెప్పి ఓదారుస్తుంది. రామవనవాసానికి అంతఃపురం అంతా గగ్గోలు పడి విలపిస్తుంటే సీత ఒకతే నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఎందుకంటే తనుకూడా భర్తతో అరణ్యాలకు వెళుతున్నానని. పెళ్ళికి వెళ్ళినట్లే అరణ్యాలకు రామునితో అనుగమించింది. అడవులలో ప్రకృతి సౌందర్యాలకు పులకిస్తుంది. భర్త తనని ఇక్కడికి తీసుకు రావటము వల్లనే ఇవి లభించాయని భావిస్తుంది. అత్రి, అనసూయల దీవనలు అందుకుని వారి ఆదరాభిమానాలకు చలిస్తుంది. అనసూయ సీతకు పతివ్రతా ధర్మాలు చెప్పి సుమతీ, సావిత్రీ వారి సరసన సీత పేరు కూడా నిలుస్తుందని చెప్పి అంగరాగాలు, మాల్యాలు, లేపనాలు ఇస్తుంది. అనసూయ దీవెనలకు మురిసిన సీత అది తన పతి సేవాఫలమేనని భావిస్తుంది.

భర్తకు రాక్షసులతో అకారణ వైరము, నిర్హేతుక శత్రుత్వం వద్దని చెపుతుంది. సీత క్లుప్తంగా పురుషునికి మూడు వ్యసనాలని, అసత్యాలు పలకటము, పరదారాభిగమనము, నిర్హేతుక శత్రుత్వం అని చెపుతుంది. అందులో మొదటి రెండు శ్రీరామునికి లేవని, ఇంకముందు రావని, ధర్మపత్నిగా తనకు ఆ విషయం తెలుసునని చెపుతుంది. మునివేషధారి అయి, శస్త్రాస్త్రములు పట్టుకున్నప్పుడు అకారణ వైరం ప్రాప్తిస్తుందని, దీని విషయం ఆలోచించమని నచ్చచెపుతుంది. రాముడు, ఇక్ష్వాకులకు శరణాగత రక్షణము తప్పనిదని, అది తనకు నిత్య సత్యవ్రతమని, మునులు రక్షణ కోరితే రక్షణ ఇచ్చానని అది అకారణ వైరం క్రిందకి రాదని నచ్చచెపుతాడు.

రాముని పరాక్రమం కన్నార చూసినదైనప్పటికీ, మారీచుని చావుకేక రాముని గొంతుతో విని, స్త్రీ సహజ బుద్ధితో, లక్ష్మణుని నిందలాడి, రాముని వద్దకు పంపుతుంది. ఈలోపల సీతాపహరణ జరిగితే, రాక్షసునితో ఏన్నోవిధాల శ్రీరాముడు వచ్చు వరకు నిలవమని చెపుతుంది. తనకు వచ్చే ఆపదగాక రాముడు పొందే శోకాన్ని తలుచుకుని బాధపడుతుంది. మృగ, పక్షి, వృక్ష సంతానాన్ని తన పోబడి, రామునకు తెలుపమని కోరుతుంది. రామునకు మార్గం తెలిపే నిమిత్తం తన వంటిమీద ఉన్న ఆభరణాలను, చించిన చీర కొంగులో కట్టి, కింద తిరుగాడే కోతుల చేతులలో పడేటట్లు విసురుతుంది.

దారి పొడుగునా రావణుని శూలాల వంటి మాటలతో బాధిస్తుంది. ఆ మాటలలోనే రావణుడు తనను లంక జేరిస్తే జరిగే భవిష్యపరిణామాలు చెపుతుంది. తాను లంకను బూడిదరాశులుగా చేస్తానని, రావణుని శిరసుల మీద తాండవమాడి రాముని చేరుతానని చెపుతుంది. ఆమె కోపాగ్ని రావణుని ముందే కూలుస్తుంది.

లంకలో రావణుడు పలికే కామవికారపు మాటలు, రాక్షస స్త్రీల దుర్భాషలు సైరివిస్తుందే కాని శపించదు. రావణునికి కనిపించనట్లు ఉదరము, వక్షస్థలము దాచుకుని, గడ్డిపరకని ఉద్దేశించి మాట్లాడినట్లు, గడ్డిపరకను ముందు ఉంచుకుని రావణునికి నీతులు చెపుతుంది. రామనామజపము తప్ప అన్యమెరగదు.

శ్రీరామ సందేశము హనుమ మూలంగా విని, రామాంగుళీయముని కన్నార కాంచి, రావణుడిచ్చిన మాసద్వయం గడువు గురించి చెప్పి, ఒక్క మాసం మాత్రం ఆశతో గడుపుతానని చెపుతుంది. తిరిగి తన చూడామణి అతనికి ఇచ్చి ఆనవాలుగా పంపుతుంది. ఒకరకంగా ఇది హనుమంతునికి శక్తినివ్వటము అవుతుంది. హనుమంతుని సొంత బిడ్డవలె చూసుకుంటుంది. హనుమంతుని తోక రాక్షసులు అంటించారన్నప్పుడు, అగ్ని దేవుని హనుమంతుని పట్ల శీతలత్వం చూపమని అర్థిస్తుంది. హనుమంతుడు తిరిగి తన వద్దకు వచ్చి తన కుశలమడిగినపుడు, 'స్వామి నిన్ను చూచి రమ్మన్నారా? కాల్చిరమ్మన్నారా' అని పరిహాసమాడుతుంది.

రావణుని చంపిన తర్వాత లోకాపవాద భీతితో, రాముని అనుమతితో అగ్నిప్రవేశం చేసి అపనింద బాపుకుంటుంది. అగ్ని అనుమతితో సీతని తిరిగి గ్రహించినా, రాముడు ఒక చాకలివాని నిందతో సీతను పరిత్యజించినా ఆగ్రహించలేదు. కుశలవులను కని, వారిని పెద్దవారిని చేసి రాముని కప్పగించి, తిరిగి రాముని చేరనొల్లక భూమిలో ప్రవేశిస్తుంది.

సీతామాత చరిత్ర అనుపమానం అద్వితీయం. దానికి సాటి వేరొకటి లేదు.

## కౌసల్య

కౌసల్య దశరధుని పట్టపు రాణి. శ్రీరాముని కన్నతల్లి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈమె చాలా దుఃఖభాగురాలు.

కౌసల్య కోసల దేశపు రాకుమార్తె. కాకుత్సుల కులదైవమయిన శ్రీరంగేశుని అనవరతమూ కొలిచే భక్తురాలు సపత్నీ మత్సరం ఎరుగనిది, పరుష వాక్కులు పలకనిది. ధర్మమూర్తి. పతి మనసెరిగి ప్రవర్తించే ఇల్లాలు. కఠోర నియమనిష్ఠలతో జీవిత శేషాన్ని భగవంతుని పాదాల కర్పించిన భవ్యమూర్తి. సపత్నుల ద్వేషించుటగాని, భర్తసేవలో విముఖత గాని ఎరుగని పతివ్రత. పరివార జనాన్ని కూడ బిడ్డలవలె ఆదరించిన మాతృమూర్తి.

రామ పట్టాభిషేక వార్త తెలిపిన మిత్రులను కౌసల్య చిరాయువులుగా దీవించి అనేక సత్కారాలు చేసింది. శ్రీరంగేశుని ప్రార్థిస్తున్న కౌసల్యలో అలౌకిక, అవ్యక్త సౌందర్యం చూస్తాడు శ్రీరాముడు. ఆమె శ్రీరామునకు పట్టాభిషేక వార్త వినగానే రాజనీతి రహస్యాలను బోధిస్తుంది. రాజు అయిన రాముడు ప్రత్యేక ధర్మాలను అనుసరించాలని, సమయా సమయాలు మిక్కిలిగాపాటించాలని, రాజధర్మం మిక్కిలి కఠినమయినదని, భార్యా భర్తలు కాని, తల్లీకొడుకులు కాని అగ్రజ సోదరులేకాని వారికన్న ప్రభుధర్మం అవశ్యకర్తవ్యమనీ చెపుతుంది. శ్రీరామునితో ఈ వంశం నూత్న గౌరవ మర్యాదలనుభవిస్తుందనీ చెపుతుంది. ఈ విధంగా కౌసల్య రాజనీతి కోవిదురాలుగా కనిపిస్తుంది.

శ్రీరాముని వనవాస వార్త విని తనను తాను అదృష్ట హీనురాలిగా భావించుకుంటుందే గానీ ఎవరినీ తప్పుపట్టదు. పేరుకు పెద్ద రాణినైనా గాని, దశరధుని ఆదరాభిమానాలన్నీ కైకమ్మకే దక్కినవనీ అదంతా తన కర్మఫలమని వాపోతుంది. రాజలోకంలో రత్నలాంటి భర్తను పొందీ, అతిలోక గుణవంతుడైన కొడుకును కలిగి కూడా తనకు దుఃఖం తప్పలేదని పరితపిస్తుంది. కోడలూ, తనూ కూడ రామునితో అరణ్యాలకు వస్తామనీ అందుకు అనుమతించమనీ వేడుకుంటుంది. చివరకు రామునిచే ప్రబోధింపబడి జీవించియున్న పతిని

పతి ఎడబాయరాదని, తను ఎక్కడ ఉన్నా కౌసల్యాతనయునిగా జీవిస్తానని చెప్పగా విని దుఃఖం పోగొట్టుకుని తల్లి తల్లి కోరేది బిడ్డల క్షేమమేనని, శుభంగా పోయి, లాభంగా రమ్మని దీవిస్తుంది. రామవనవాసం క్షేమంగా గడిచేందుకు తాను భగవదర్చనా, భర్త సేవలో గడుపుతానని చెపుతుంది. మంగళా శాసనం చేస్తుంది.

కౌసల్య యొక్క సపత్నీ వాత్సల్యం అవధులు మీరినది. తన భర్త, కైక ఎడల మోహం చూపినా, తన తనయుడు కైక దగ్గరే ఎక్కువకాలం గడిపినా అది కైక యొక్క గుణముల ప్రభావమనీ, ఆమెను ముద్దు చెల్లెలిగా చూసిందే తప్ప తిట్టలేదు. సుమిత్ర గుణగణాలు నచ్చి ఆమెతో సాన్నిహిత్యం పెంచుకుంటుంది. పిల్లలు కలుగక ముందు, కలిగిన తర్వాత కూడా సుమంత్రుడు (మహామాత్యుడు) ఆమె పుత్రవాత్సల్యం పొందగలిగాడు.

కౌసల్య వనితా ధర్మాలెరిగిన ఆదర్శమూర్తి. విపిన ప్రయాణానికి ముందు సీతకు స్త్రీ ధర్మాలు వివరిస్తుంది. చిన్నవయసులోనే పడరాని కష్టాలు వచ్చినాయని భర్తను గాని, మామగారిని గాని నిందిచక కష్ట, సుకాలలో భర్తను దైవంగా భావించు. భర్త గౌరవమే తన గౌరవమని చెపుతుంది. సతీధర్మాన్ని పాటించే ఆడుదానికి త్రిభువనాలూ, సర్వశక్తులూ లోబడి ఉంటాయి. ఆదర్శ స్త్రీ రత్నాలు అయిన అనసూయ, సుమతి, సావిత్రి వలె పేరుగాంచమని దీవిస్తుంది. పౌరుష వంతుడైన రముడు దైవోపహతుడైనా, రానున్న కాలంలో సీత అనుభవించే సౌఖ్యం, నారీ జనానికి అసూయ కారణమవుతుందనీ, ఇంక సీత స్థానం పెరుగుతుందనీ చెపుతుంది. భర్తకు దాసి వలె, మంత్రి వలె, భార్యవలె, భార్యవలె, చెలికాని వలె, తల్లివలె ఆయా సమయాల్లో తోడుపడాలని చెపుతుంది.

సీతా, రామ, లక్ష్మణులు రథమెక్కి వనవాసానికి వెడుతుండగా, మందిరం వెలుపలికి రాని మానవతి అయినా, మేరమీరిన దుఃఖంతో పాదచారిగా రథం వెంట కొంత దూరం పరుగుపెడుతుంది. దశరథుడు, రాముడు వనవాసానికి వెళ్ళిన వెంటనే, కౌసల్య ఇంటికి రాగా మొదట దుఃఖముతో పరితపించినా తరువాత సుమిత్ర మాటలతోనూ, రాముని మాటలు గుర్తురాగానూ నిబ్బరించుకుని పతికి వలసిన సేవా శుశ్రూషలు చేస్తుంది.

దశరథుడు ఆమెని క్షమించమని అర్థిస్తాడు. తాళి గట్టిన తనను దయతో చూడమని వేడుకుంటాడు. ఆమెను నిత్య ధర్మతత్పరవని, నిత్యంలోకంలో జరిగే మంచి చెడ్డలు తెలిసిన దానివని, పతి జీవితవని, గుణవంతురాలివని కీర్తిస్తాడు. అపుడు కౌసల్య కాంతుని క్షమనర్థిస్తుంది. భార్యను భర్త వేడుకోవడము ధర్మవిరుద్ధమని, తనని ఆర్థించి, చంపవద్దని వేడుకుంటుంది. పుత్రవియోగం చేత కారుకూతలు కూశానని తన్ను క్షమించమని వేడుకుంటుంది.

శ్రీరాముడు తన తల్లిని గూర్చి లక్ష్మణునితో ఆమె పుట్టుక చేతనే దుర్భల శరీర అని, గుండె నిబ్బరం లేనిదని, సామన్య కులస్త్రీగానే జీవించిందని, పట్టపుదేవేరిననే అహం ఎరుగనిదనీ, అల్పభాగ్య, అమాయకురాలనీ చెపుతాడు. అపుత్రవతిగా పొందిన పరితాపం కన్నా, పుత్రవతి అయి తన మూలంగా పొందుతున్న పరితాపం ఇంకా ఎక్కువనీ అట్టి తల్లిని ఆరని మంటలో తోశానని పరితపిస్తాడు. సుమంత్రుని ద్వారా, కౌసల్య ప్రయోజకుడయిన కొడుకుని కని కూడా ప్రజాభ్యుదయం కోసం త్యాగం చేసిన ధన్యజీవి అని ఆమె హృదయౌన్నత్యానికి పోలికే లేదని, సుమిత్రమ్మ పిన్నిని చూసుకుని ధైర్యంగా ఉండమని ఆమె ఆశీర్భలం తమని వెన్నంటి ఉంటుందని, తండ్రిని యధాశక్తి సేవించమనే చెప్పి పంపుతాడు.

పతి మరణించగా ధైర్య, స్థైర్యాలు కోల్పోయినా, తిరిగి నిబ్బరం తెచ్చుకుని కాగల కార్యాలు నెరవేర్చుటకు ఆనతినిస్తుంది. భరతుడు పెద్ద తల్లికి మొక్కరాగా, మొదట అతనికి రాజ్యం నిష్కంటకంగా చేసి అతని తల్లి ఇచ్చిందని, అతని పట్టాభిషేకవరాలుగా తనని కూడా రాముని దగ్గరకి పంపమని వేడుతుంది. భరతుడు పలికిన ప్రతిజ్ఞావాక్యాలు కర్ణశూలాలుకాగా, అతనిని పుత్ర సమానంగా - భావించి లేవనెత్తి గాఢంగా కౌగిలిస్తుంది. పొరపాటు క్షమించమని వేడుకుంటుంది. అరణ్యంలో సీతా, రామ, లక్ష్మణుల పాట్లు చూసి

చాలా బాధపడివారి సుఖసంతోషాలకై భగవదార్చన ముమ్మరం చేస్తుంది. రాముడు పెట్టిన గారపిండి పిండోదకాలను చూసి రాజశ్రేష్ఠుడయిన దశరధుడి అవి ఎలా ఆరగిస్తాడని విలపిస్తుంది.

రామ పట్టాభిషేకానంతరం కొంత కాలం సుఖపడినా, సీతమ్మ మీద అపవాదుతో ఆమెని రాముడు అడవికి పంపితే శోకిస్తూ కాలం గడుపుతుంది. లవకుశల రామాయణ గానం విని ఆమె వారు తన మనుమలేమోనని శంకిస్తుంది. మనుమలేనని తెలిసి ఆమె సంతోషం వర్ణనాతీతమయినా, సీతమ్మ అదృశ్యం తిరిగి శోకార్తులని చేస్తుంది.

కౌసల్య ఎంత దుఃఖితురాలైనా ఆమె ధీర స్వభావం, సౌజన్యత మరుపురానివి.

(ఇంకావుంది)



శ్రీమతి ప్రమీలా చంద్రమోహన్ గారు , ఎమెస్కో పబ్లికేషన్స్ స్థాపకులు శ్రీ ఎమ్.ఎన్. రావు గారి పెద్దకుమార్తె.
భర్త , రిటైర్డ్ ప్రొఫెసర్, శ్రీ చంద్రమోహన్ గారితో తిరుపతిలో నివాసం.